క్లుప్తంగా

నేడు కార్యకర్తలకు అందుబాటులో హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆదివారం ఉదయం 10 గంటలనుంచి అద్దంకిలోని పార్టీ కార్యాలయ నాయకులు శనివారం ఒకప్రకటనలో తెలిపారు. కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

19న మండల సర్వసభ్య సమావేశం

కారంచేడు: ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీ బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లతో పాటు మండలంలోని అన్ని శాఖల అధికాలు మీ శాఖల పూర్తి సమాచారంతో తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

రాతి ముఖమండప నిర్మాణానికి విరాళాలు


నగదు అందజేసి రశీదు పొందుతున్న దాతలు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ దేవస్థానం రాతి ముఖమండప నిర్మాణానికి దాతలు ప్రకాశం జిల్లా బొద్దికూరపాడు గ్రామానికి చెందిన రావినూతల వెంకట సుందర మనోజ్‌కుమార్, మంగ గాయత్రిలు, పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన తురుమెళ్ల వెంకటసుబ్బారావు, విజయలక్ష్మీలు చెరో రూ.1 లక్షలను దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ పీ. శ్రీనివాసరావుకు అందజేశారు.

కథనంతో కదిలిన అధికారులు


మంచంలో ఉన్న రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి


వైద్యశిబిరంలో రోగులను పరీక్షించి సూచనలు ఇస్తున్న వైద్యాధికారి

సాక్షి ఎఫెక్ట్..

బల్లికురవ: జ్వర పీడితులను సర్వేతో గుర్తిస్తూ ఇంటింటా పరీక్షలు చేస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ తెలిపారు. శనివారం సాక్షిలో 'పడకేసిన పారిశుద్ధ్యం–మంచం పట్టిన పల్లెలు' అన్న శీర్షికతో వచ్చిన కథనానికి గ్రామపంచాయతీ అధికారులు, వైద్యారోగ్యశాఖ తక్షణమే స్పందించారు. పెద అంబడిపూడి గ్రామంలో జ్వరపీడితులను గుర్తించి ఇంటింటా పరీక్షలు చేశారు. ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో రక్తపరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చేతులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా కడుక్కోవాలని సురక్షిత మంచినీరు తాగాలని చెప్పారు. మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించుకోవాలని వైద్యాధికారి కోరారు. జలుబు, దగ్గు అస్వస్థతలో ఉంటే తక్షణమే పీహెచ్‌సీకి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వీధుల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేపట్టారు.

సెయింట్ ఆన్స్ కళాశాలకు అవార్డు


సర్టిఫికెట్ అందుకుంటున్న కళాశాల యాజమాన్యం

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి అవార్డు లభించింది. స్వయం ఎన్‌పీటీఈఎల్ వారిచే యాక్టివ్ లోకల్ చాప్టర్ స్పెషల్ కేటగిరి ప్రాస్పెక్ట్ అవార్డు సాధించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు సంయుక్త ప్రకటనలో శనివారం తెలిపారు. చెన్నైకి చెందిన మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ అండ్ డెవలప్‌మెంట్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి వారిచే ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులను నిర్వహిస్తుందని తెలిపారు. ఇందులో ఇంజినీరింగ్ విద్యార్థులు రిజిస్టరై ఆధునిక టెక్నాలజీకి సంబంధించిన కోర్సులను అభ్యసించవచ్చని తెలిపారు. 2024లో కళాశాల నుంచి 563 మంది ఉత్తీర్ణత సాధించి సర్టిఫికెట్లు పొందనట్లు ప్రిన్సిపాల్ కే జగదీశ్‌బాబు తెలిపారు. ఇద్దరికి గోల్డ్ మెడల్స్ 31 మందికి సిల్వర్ మెడల్స్,179 మందికి ఎలైట్ సిల్వర్ మెడల్స్ తో పటు 124 మందికి సర్టిఫికెట్‌లు సాధించినట్లు తెలిపారు. ఎన్‌పీటీ ఈఎల్ వారు కళాశాలను లోకల్ యాక్టివ్ చాప్టర్‌గా గుర్తించి సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ డీవీఎస్ సుకన్యకు సర్టికెట్ ఆఫ్ అప్రిసియేషన్ అందజేశారని తెలిపారు. ఈ ఉత్తీర్ణత సాధించిన ఎన్‌పీటీఈఎల్ ఫ్యాకల్టీని అభినందించారు.

బాబూ జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడు


సంతమాగులూరులో జగజ్జీవన్‌రావుకు నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

చీరాల: స్వాతంత్ర్య సమరయోధుడు, సాంఘిక సంస్కర్త, భారత ఉప ప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని శనివారం చీరాలలోని ముక్కోణం పార్కు సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ముక్కోణం పార్కు సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాపట్ల జిల్లా ఎమ్మెస్పీ అధ్యక్షుడు బి.లక్ష్మీనరసయ్య మాదిగ మాట్లాడుతూ దేశ చరిత్రలో సుదీర్ఘకాలం కేంద్ర మంత్రిగా కొనసాగిన ఏకైక వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని అన్నారు. రైల్వేశాఖ మంత్రిగా, కార్మికశాఖ, వ్యవసాయ శాఖ మంత్రి పదవులు చేపట్టి అనేక సంస్కరణలు చేయడంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. నేటికి ఆ సంస్కరణల ఫలాలను ప్రజలు అనుభవిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు వందనం మాదిగ, చీరాల నియోజకవర్గ అధ్యక్షుల రమేష్, వేటపాలెం ఎమ్మార్పీఎస్ నాయకులు జి.మత్తయ్య, పండ్లూరి జగదీష్, ఎస్.అప్పారావు, డి.చిరంజీవి, వాయిల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు శాఖ లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని గ్రంథాలయంలో నిర్వహించారు.

డ్రైనేజీపై మూతల ఏర్పాటు


డ్రైనేజీపై మూతలు ఏర్పాటు చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్

చీరాల అర్బన్: పట్టణంలోని సంగం థియేటర్ కూడలి వద్ద డ్రైనేజీపై మూతలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈసమస్యను గుర్తించిన మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి శనివారం పరిశీలించారు. డీఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో డ్రైనేజీని పరిశీలించిన వాయన వెంటనే డ్రైనేజీపై మూతలు ఏర్పాటు చేయించారు. కూడలి వద్ద డ్రైనేజీపై మూతలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించామన్నారు.

చీరాల బీచ్‌లో భద్రతా చర్యలు


గజ ఈతగాళ్లకు లైఫ్ జాకెట్లు అందిస్తున్న రిసార్ట్స్ యజమానులు

చీరాల: యువకుల వరుస మరణాలతో చీరాల తీర ప్రాంతాన్ని గత కొద్దిరోజులుగా మూసివేశారు. పర్యాటకులను పోలీసులు అనుమతించకపోవడంతో బీచ్ బోసిపోయింది. పోలీసులు, ఎమ్మెల్యే, బీచ్ రిసార్ట్స్ యజమానులతో పలుమార్లు చర్చలు జరిపారు. దీంతో శనివారం రాష్ట్ర బీచ్ రిసార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాడరేవు నుంచి పొట్టిసుబ్బయ్యపాలెం వరకు ఉన్న పదికిలోమీటర్ల మేర తీరంలో ఐదు చోట్లను సముద్రంలో మునిగేందుకు ఎంపిక చేశారు. అయితే ఈ ఐదు ప్రాంతాలలో గజ ఈతగాళ్లను రిసార్ట్స్ యజమానులే ఏర్పాటు చేశారు. వారికి లైఫ్ జాకెట్లు అందించారు. అలానే పర్యాటకుల అవగాహన కోసం సముద్రంలో ఎర్రజెండాలు ఏర్పాటు చేశారు. ఐదు చోట్ల పోలీసులు, మెరైన్ పోలీసులు గస్తీ చేసేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రిసార్ట్స్ అధ్యక్షులు, నాయకులు ఎ.భవానిప్రసాద్, వీరభద్రరావు, డాక్టర్ రవికుమార్, గోవిందరెడ్డి, హరికృష్ణతో పాటు పలు రిసార్ట్స్ యజమానులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోవర్ధిని

చీరాల అర్బన్: బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం చీరాల కేజీబీవీలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.గోవర్ధిని అధ్యక్షత వహించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికలకు శాపాలుగా మారుతున్నాయన్నారు. బాల్యవివాహాల వలన బాలికల ఆరోగ్యం దెబ్బతింటుందని, వారు మానసికంగా, శారీరకంగా పరిణితి చెందకపోవడం వలన అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాల్యవివాహాలు ఇంటి చుట్టుపక్కల గృహాల్లో చేస్తే 1098 సంప్రదించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లాంటి వాటిపై సమయస్ఫూర్తి కలిగి ఆపద సమయంలో తమని తాము రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు సుభాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులను రక్షించుకోవాలి


మాట్లాడుతున్న ఏడీ మోహనరావు


పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ

అద్దంకి: మనుషుల నుంచి జంతువులకు, జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులనే జూనోసిస్ అంటారని ఏడీ మోహనరావు అన్నారు. వ్యాక్సినేషన్ చేయించకుంటే పెంపుడు జంతువుల నుంచి జూనోసిస్ వస్తుందని ఏడీ చెప్పారు. జూనోసిస్ డే (పశుసంక్రమిత వ్యాధుల దినోత్సవం) సందర్భంగా వైద్యశాలలో శనివారం జూనోసిస్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెంపుడు జంతువుల నుంచి యజమానులకు ఇతరులకు వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ప్రతి పెంపుడు జంతువుల యజమనికి వాటికి వ్యాక్సికేషన్ చేయించాలని చెప్పారు. ఏడీ మాట్లాడుతూ పెంపుడు జంతువుల లాలా జలంలో జూనోసిస్ వ్యాధులు కలుగజేసే క్రిములు ఉంటాయని చెప్పారు. లాలాజలం వలన రేబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ తరహాలో పెంపుడు జంతువులైన చిలుక, కుక్క, కుందేళ్లు వంటి పెంపుడు జంతువులను చెప్పుకోవచ్చన్నారు. ప్రతి పెంపుడు జంతువు యజమాని తమ పెంపుడు జంతువులకు తప్పనిసిరగా వ్యాక్సిన్ వేయించాలని చెప్పారు. పట్టణంలోని పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


శ్రీనివాసుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

చీరాల అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. 108 మంది మహిళలచే గోవిందనామ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోవింద ప్రచార సంఘం ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం, రైతుల సంక్షేమం కోసం శ్రీరంగం నుంచి అయోధ్య వరకు పాదయాత్ర జరుగుతుందన్నారు. పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను స్వామివారి పాదాల వద్ద ఉంచి పూజ చేశారు. అక్టోబర్ 12న ప్రారంభమయ్యే మహాపాదయాత్రలో వెయ్యి మంది భక్తులు పాల్గొంటారన్నారు. పాదయాత్ర విజయవంతం కావాలని పూజలు నిర్వహించామన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

తప్పిపోయిన గేదెలను తీసుకెళ్లాలని రైతు వినతి


ముక్తేశ్వరం గ్రామానికి చేరిన గేదెలు

బల్లికురవ: తప్పిపోయి గ్రామానికి వచ్చిన గెదేలకు ఆశ్రయం కల్పించానని తగిన ఆనవాళ్లతో తోలుకెళ్లానని రైతు నాగండ్ల యల్లమందరావు శనివారం తెలిపారు. బల్లికురవ మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి మూడు రోజుల క్రితం 10 గేదెలు వచ్చి తన పొలంతో తిరుగుతున్నాయని చెప్పాడు. ఎంత తోలినా పోలేదని, తప్పిపోయి వచ్చాయని తెలిసి తన పశువులశాలలో కట్టేసి ఆశ్రయం కల్పిస్తున్నానని తెలిపాడు. వీటి విలువ సుమారు రూ. 5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఉంటుందని రైతు వివరించారు. మూడు రోజులుగా పొలం తోలుకెళుతూ మేత మేపుతూ తిరిగి ఇంటికి వస్తున్నామని ఇప్పటికే సమీప గ్రామాల్లో అందరికి తెలియజేశానని, తగిన ఆనవాళ్లతో వస్తే అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామని రైతు యల్లమందరావు వివరించారు.

వ్యవసాయ పనులకు సమాయత్తం


వల్లాపల్లిలో దుక్కులు దున్నుతున్న రైతులు

బల్లికురవ: ద్రోణి ప్రభావంతో శుక్రవారం బల్లికురవ మండలంలో కురిసి వర్షానికి శనివారం రైతులు వ్యవసాయ పనులకు సమాయత్తం అయ్యారు. మండలంలోని వల్లాపల్లి, అంబడిపూడి, కొణిదెన, నక్కబొక్కలపాడు, వేమవరం సోమవరప్పాడు, కోటావారిపాలెం, గ్రామాల్లోని గరప, ఎర్రనేలల్లో ట్రాక్టర్ దుక్కులు దున్నారు. ఈ దుక్కులతో మెట్టభూముల్లో పత్తి, కూరగాయాలు, పప్పు ధాన్యాల సాగుచేపడతామని రైతులు తెలిపారు. పూర్తిస్థాయిలో ఈ దుక్కుల్లో భూములు పదునెక్కితే విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు.

పురుగుమందుల షాపులపై విజిలెన్స్ దాడులు


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

చీరాల రూరల్: అనుమతిలేని పురుగుమందులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు. శనివారం పర్చూరు, ఇంకొల్లు, చీరాల మండలాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ నిర్వహించారు. విజిలెన్స్ అధికారులు టీం, విజిలెన్స్ ఎస్సై శ్రీ జి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు సీహెచ్ రవికుమార్ పల్నాడు ఏడీఏ, డీఏఓ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, పురుగుమందులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. చీరాల ఏడీఏ కె భాస్కరరావు, చీరాల మండల వ్యవసాయ అధికారి ఐ.సుమతి, టెక్నికల్ ఏవో ఏ. తిరుమలరావు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించాలని మంత్రికి వినతి


మంత్రి గొట్టిపాటికి వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

జే.పంగులూరు: మాకు జీతాలు ఇప్పించండని గ్రేడ్ 5 ఉద్యోగులు శనివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అద్దంకిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి వారు గోడు విన్నవించుకున్నారు. మూడు నెలల నుంచి మాకు జీతాలు రావడం లేదని. దానికి సంబంధించి పలుమార్లు అధికారులకు వినతులు ఇచ్చామన్నారు. కాని ప్రయోజనం ఏమి లేదని తెలిపారు. మార్చిలో అప్పటి కలెక్టర్ పంచాయతీకి ఒక సెక్రటరిని ఇచ్చి డీపీవోకు వ్యవహారాలు ఇచ్చారని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ, పైఅధికారులు ఆదేశాల మేరకు వారి లాగిన్‌లో గ్రేడ్ -5 జీతాలు పెట్టారన్నారు. మంత్రి స్పందించి రెండు రోజుల్లో పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకుపోయి పరిష్కరిస్తామని హమీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఐదు మండలాల నుంచి పంచాయతీ కార్యదర్శులు ఆరిఫ్, పి వాణి, సీతారామయ్య, జి ప్రసాద్, వందనం నియోజక వర్గ గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

చీరాల టౌన్: జీవాల ఆరోగ్యంపై పశుపోషకులు జాగ్రత్తగా ఉండటం వలన జీవాలకు సీజనల్ వ్యాధులు దరిచేరవని ఈపురుపాలెం పశువైద్యాధికారి డాక్టర్ పావని సూచించారు. మండలంలోని ఈపురుపాలెం గ్రామపంచాయతీలోని బోయినవారిపాలెం గ్రామంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 55 గేదెలకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 19 గొర్రెలు, 18 గేదెలకు నట్టల వ్యాధి నివారణ మందుల ఉచితంగా అందించారు. ఈసందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం, పశువుల పెంపకం ముఖ్యమైనవని పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటుగా క్రమం తప్పకుండా చూడి పరీక్షలు చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు, పాల ఉత్పత్తి పెరిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

మార్టూరు: వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జీ నితిన్ అన్నారు. మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. మురుగు కాలువలలో నిలిచి ఉన్న మట్టి, గడ్డి మొక్కలను తొలగించి వర్షపు నీరు, మురుగునీరు పూరి వెలుపలకు ప్రవహించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మురుగు కాలువల నుంచి తీసిన పూడికలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా సిబ్బంది తొలగించాలని ఆదేశించారు. ఈఓఆర్డీ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.